# ఎర

అనూరాధారమణన్

అనువాదం: మధురాంతకం రాజారాం

ఆనాడు—

గౌతమ మహర్షి ఆశ్రమంలో భళ్ళున తెల్లవారకముందు అహల్య కెదురైన విపత్తు ఏదైతేవుందో, సరిగ్గా అదేవిపత్తు భాగీరథికిన్నీ ఎదురైంది. స్థలాలు, కాలాలు, వ్యక్తులు వేరు. సంఘటన ఒకటే.

ఎటొచ్చీ తన భర్తకు, పరాయివ్యక్తికీ తేడా తెలియని స్థితిలో వుండిపోయింది అహల్య. భాగీరథి కలాంటి అవకాశంకూడా లేకపోయింది.


"ఓరి నీ పాతకం కూలిపోనూ, నీకేమొచ్చిందిరా చేటు? పోతావులే! నాశనమైపోతావులే," అంటూ కసిదీరా శపించింది. అయినా శాపనార్థాలవల్ల ఒరిగేదేముంది? శీలానికి వాటిల్లిన నేగి మాసిపోతుందా?

మనిషిని గుటుక్కున స్వాహా చేసి. గర్రున త్రేన్చుతూ నిలబడిపోయిన రాక్షసుడిలా ఆ గదిలో నేలకూ పైకప్పుకూ ఏకాకృతిగా నిల్చునివున్నాడు ఆంథొనీ.

కళ్ళనిండుకూ తియ్యటి కలల్ని ప్రోది చేసుకుని. గుండెనిండుకూ ఆశలు నింపుకుని ఆరు నెలల క్రితం రఘుపతి గురుక్కళ్‌కు అర్ధాంగిగా ఆ వూళ్ళో అడుగు మోపిన భాగీరథి. యిలాంటి పిడుగుపాటొకటి తన కెదురుగా వచ్చునని కలలోనైనా వూహించి వుండదు.

ఆంథొనీ తీసుకునే నిర్ణయం, లేదా వేసే ఎత్తు అదెలాంటిదైనా జరిగి తీరవలసిందే. ఆ కుగ్రామంలో మూడంతస్తుల మేడ అతడి కొక్కడికేవుంది. చిటికెన వ్రేలంత లావుగా మెడకు వ్రేలాడే బంగారు గొలుసుతో, నడుము చుట్టూ నల్లటి తోలు దట్టీతో, అతడు పొద్దు పొడిచే సమయాల్లో తన నాటు తుపాకీకి మందు దట్టిస్తూ వీధి అరుగుపైన కూచున్నాడంటే, ఆ పరిసరాల్లో నడయాడడానికి మగవాళ్ళే వెనకాడతారు. ముక్కును అందుకోవానికి చేతిని తలచుట్టూ త్రిప్పినట్టుగా, నాలుగడుగులు వేస్తే కనిపించే కావేరికి ఆ వీధి అమ్మలక్కలు నాలుగు వీధులు ప్రదక్షిణంచేసిగానీ వెళ్ళలేరు. అంత హడల్!

కానీ భాగీరథి కొత్త కోడలై పోయింది



గదా! బిందె చంక కెత్తుకుని దించిన కను రెప్ప పైకెత్తకుండా ఆమె తన పాటుకు తాను ఒకటి రెండు రోజులపాటు ఆ వీధి గుండా కావేరికీ, యింటికీ తిరిగింది.

"ఒరే మరుదూ! కాలికి మెట్టెలు. మెడలో కొత్త పసుపుతాడు.... కొత్తపిట్ట ఒకటి మనవీధిలోకి కొట్టుకొచ్చినట్టుందే! ఎవర్రా...." ఆంథొనీ తన నౌకరును పిలిచి వాకబు చేశాడు.

"రఘుపతి గురువుగారులేరాండీ! ఆయనకు పెళ్ళయిందిగా....భార్య కాపురాని కొచ్చింది...."

"పిట్ట వొంటరిగా దొరకాలిగదా!"— ఆంథొనీ మనసులో బీజారోపణ జరిగింది.

ఒకనాటి పట్టపగటివేళ రఘుపతి మాధ్యాహ్నిక పూజావిధులు నిర్వర్తించడం కోసం గుడికి వెళ్ళిన సందర్భాన్ని కనిపెట్టి, ఆంథొనీ జంకు గొంకులులేకండా యింట్లోకి చొచ్చుకుని వచ్చేశాడు.

అంతకు మునుపే తలంటిపోసుకున్న భాగీరథి తడి వెంట్రుకల్ని గాలికి ఆరబెట్టు కుంటూ మంచంపైన పక్కవాటుగా పడుకుని పైకప్పుకేసి చూస్తోంది.

హఠాత్తుగా బయటి మనిషిని చూసేసరికి... 

హాచ్మస్పుతో క్రిందూ మిందూకానని పశుబలంముందు పజ్జెనిమిదేళ్ళ సుకుమార, భాగీరథి ఏం నిలుస్తుంది?

అతగాడు బెల్టు తగిలించుకుని, కాలికి చెప్పులు తొడుక్కుంటూవుండగా—

'ఓం పూర్ణమదః పూర్ణమిదం పూర్ణాత్' ఒకచేత బాదం ఆకువేసి మూసిపెట్టిన కంచుగిన్నెతో మరొకచేత గుడి తాళం చెవితో రఘుపతి చక్కాలోపలికి వచ్చేశాడు.

విషయం గ్రహించడానికి క్షణంలో సగం పేపు పట్టలేదు. ఆ పాటికి రఘుపతి ఒళ్ళంతటా చెమటపట్టేసింది. ముఖం జేవురించింది. నిట్టనిలువునా కంపించిపోతూ గుడ్లురిమి చూసున్నాడు. అయితే ఆ గృహస్తుడి ఉనికిని ఖాతరేచెయ్యకుండా ఆంథొనీ నిర్లక్ష్యంగా బయటికి వెళ్ళిపోయాడు

చేతిలోవున్న పాత్రను క్రింద పెట్టడం కూడా మరిచిపోయిన రఘుపతికుప్పకూలా నేలకంటుకపోయివున్న భాగీరధి కేసి తీక్షణ వీక్షణాలు విగుడిస్తున్నాడు.

కొంగులో ముఖం దాచుకుని కుమిలి కుమిలి ఏడుస్తోంది భాగీరథి

"అయ్యో, ఎంత పని జరిగిపోయింది" అని ఒకవైపున అనిపిస్తూనేవున్నా, రఘుపతిలో చెలరేగిన ఆగ్రహం ఆ అనుతాపాన్ని దిగమ్రింగేసింది.

"దీన్ని....దీన్ని....ఇప్పుడేం చేయాలి? మండిపోతున్న ఎండలో బరబరా లాక్కెళ్ళి కావేరిలోకి గిరవాటుపెడితే?"

ఆనందవికటన్
నిర్వహించిన
కథల పోటీలో
పదివేల రూపాయల
ప్రథమ బహుమతి
పొందినకథ

అంతలో మళ్ళీ అతడి అంతరంగం తిరగబడింది. "ఎవడో అఘాయిత్యం చేసిపోతే అంపు కీమెను శిక్షించడం ఏం న్యాయం?"

"మరైతే ఈ నాలుగు గోడల మధ్య నువ్వింక ఈమెతో సంసారం కొనసాగిస్తావా? సాధ్యమయ్యే పనేనా? నిశ్చింతగా ఆమె ప్రక్కన పడుకోగలవా? ఊరూనాడూ యేమనుకుంటుంది నిన్ను గురించి?"

రఘుపతి రాతిబొమ్మలా స్తంభించిపోయాడు

"ఏమండీ! ఏ దేవుడికీ నాపైన కనికరం లేకపోయింది గదండీ! మీరయినా కొంచెం ముందుగావచ్చి వుండకూడదా!" అని ఆక్రోశిస్తూ సుడిగాలికి విరుచుకుపడిపోయే లేత అరటి మొక్కలా భాగీరథి అతడి పాదాలపైన వ్రాలిపోయింది శరణాగతి తప్పితే తనకింక గత్యంతరం లేదన్నట్టు బిగ్గరగా అతడి కాళ్ళను కావలించి పటుకుంది. ఆ స్పర్శ తాకిడికి తనను తీసికెళ్ళి జలవారి మురికి గుంటలో ముంచి లేవనెత్తినట్టు రఘుపతి శరీరం జలదరించిపోయింది.

"ఇదిగో! నీకే చెప్పడం! తప్పుకో.... తప్పుకో...."

—ఆ మాటలెక్కడివి? తనవికావే! ... రఘుపతి తన గొంతుకను తానే పోల్చుకోలేకపోయాడు. ఇంట్లో వున్నంతసేపూ కొంగు పట్టుకుని తనను వెన్నంటి తిరిగే తన భర్త యిప్పుడు తన కంటిబాటులో లేని ఏ సుదూర సీమల్లోనో నిల్చున్నట్టు తోచడంతో దుఃఖోద్వేగం మరింతగా కట్టలు తెంచుకుని భాగీరధి రెక్కలుతెగిన పక్షిలా విలవిలలాడిపోయింది.

"ఏమండీ.... అలా చూస్తారేమండీ! భయంగా వుంది. అలా చూడకండీ...."

"ఛీ. మాటాడొద్దు వెళ్ళు బయటికి." అతడి చూపుడువ్రేలు వీధి గుమ్మాన్ని నిర్దేశించింది.

నిలువునా నీరై పోయిన భాగీరథి అతడి వైపు అయోమయంగా చూస్తోంది.

"తిరుగులేదు. నిజంగానే చెబుతున్నా! ఇకమీదట మనం ఒక యింట్లో కలిసి బ్రతకడం అసాధ్యం. ఈ రాత్రికే నేను వెళ్ళిపోతున్నాను ఎక్కడికి పోతానో చెప్పలేను. ఈ వూళ్ళోమట్టుకు వుండను."

"వొద్దొద్దు. అంతమాటనకండి! నాకున్న దిక్కల్లా మీరే, అంతగా యిష్టం లేకపోతే మీ చేతులారా మీరే నన్ను గొంతు నులిమి చంపేసినాసరే...."

ఆమె దీనంగా అర్థించింది. గుండె లవిసిపోయేటట్టుగా రోదించింది. రెండు చేతులతోనూ నెత్తిని బాదుకుంటూ కూర్చున్నచోటు నుంచి లేవలేక అలాగే భూపతనమైపోయింది.

ఆమె తలలో గింగుర్లు తిరుగుతున్న ప్రశ్న ఒక్కటే.

"ఇలా మాట్లాడ్డానికి ఈయనకు నోరెలా వచ్చింది? ఈయన లేకుండా తానీ వూళ్ళో ఎలా జీవిస్తుంది? ఏమైపోతుంది? భగవంతుడా! ఈ నిప్పుల గుండంలో పడిపోయాక యింక తన బ్రతుకేమైపోతుంది?"

అన్నంతపనీ చేశాడు రఘుపతి ఇంటికి తాళం బిగించి ఆ రాత్రికి రాత్రే వూరు వదిలిపెట్టేశాడు కాళ్ళకు పెనవేసుకుని యెంతకూ వదిలిపెట్టని భాగీరథిని తొలగ ద్రోసుకుని వెళ్ళిపోయాడు. ఊరికంతా విదితమే! ఆంథొనీ అంటే గుండెల్లో జ్వరంలేని దెవరికి? కలగజేసుకునే వాళ్ళెవరు?

తల్లి దండ్రులుంటే ఆ సంగతి వేరు భాగీరథికి చిన్ననాడే ఆ అదృష్టం కరువైపోయింది. పరులపంచల్లో యెంతకాలమని పడివుంటుంది?

"చస్తేనేమేలు? ఇంక బ్రతకడం దేనికి?" ఊళ్ళో ఆడవాళ్ళ తీర్పు

కొంతకాలం గుడిగోపురంక్రింద పడిగాపులు పడింది. తన అతీ గతీ తెలుసుకోడం కోసం భర్తదగ్గరినుంచి జాబేదయినా వస్తుందేమోనని కొంతకాలం తపాలాఫీసుచుట్టూ అఘోరించింది.

ఆడపిల్లల్ని మందలించడానికి ఆ వూరివాళ్ళు ఉపయోగించే తిట్ల జాబితాకు అదనంగా ఒక కొత్త ప్రయోగం తోడుకావడమే యిటీవలి పరిణామం— "భాగీరధిలా

వీధుల పాలవుతావులే!"

ఒకరోజు—

ఎడతెగని ఆలోచనల ప్రవాహంలో కొట్టుమిట్టాడి పోయినభాగీరథి, ఆఖరుకొక నిర్ణయం తీసుకున్నట్టు ఏకైక ఆస్తిగా మిగిలిన తన చిన్న చేతి సంచీతోబాటుగా వచ్చివచ్చి ఆంథొనీ యింటిముంగిట వీధి వాకిలిలో నిలబడిపోయింది.

ఉప్పు కాగితంతో తుపాకీకి మెరుగు పెడుతున్న ఆంథొనీ, దగ్గర్లో నీడలాంటి దేదో పారాడినట్టు గమనించి, తటాలున తలపైకెత్తాడు. గొంగళి పురుగుల్లాంటి కనుబొమ్మల్ని పైకి రిక్కించి అతడలాగే రిచ్చపాటుతో ఆమెవైపు చూస్తూ వుండిపోయాడు.

ఆమె కళ్ళు! కళ్ళా అవి! నిప్పులుమిసినట్టుగా తనవైపు చూస్తున్న ఆ కళ్ళకేసి చూడలేకపోయాడు. ఆ కళ్ళను, ఆ చూపుల్ని తానారోజే యెందుకు దర్శించలేకపోయాడు?.... తుపాకీ గోడకానించి అతడు మెల్లగా లేచి నిల్చున్నాడు.

ఆంథొనీ బుర్రలోకూడా పురుగుతొలిచినట్టుగా ఆలోచన ప్రారంభమైపోయింది. తన పశువాంఛకు బలైపోయిన స్త్రీల జాబితా చిన్నదేమీకాదు. కానీ ఈమెలా తెగబడి వచ్చి, యింటి గుమ్మంలో నిలబడి, ఈ బెల్లాంటి చూపుల్ని తనపైకి ఎక్కుపెట్టినవాళ్ళెవరూ లేరు

"ఇకమీదట నేనీ యింట్లోనే వుండ దలచుకున్నాను...."

విల్లు నుంచి వెడలిన బాణంలా ఆమె రివ్వన లోపలికి దూసుకపోయింది. నౌఖరు మసుదు తెరిచిన నోటిలో ఈగ జొరబడదమైనా గమనించకుండా, ఆమె వైపు నివ్వెరపోయి చూస్తున్నాడు.

"అమ్మగారూ! ఇంట్లో ఆడవాళ్ళెవరూ లేరండి!" కొంచెం తేరుకున్నతర్వాత అతడు చెప్పిచూశాడుకూడా.

"తెలుసు" బదులిస్తున్నట్టుగానే ఆమె గృహాంతర్భాగంలోకి వెళ్ళిపోయింది.

తుపాకీ చేతబట్టుకుని చరచరా ఆమె వెంట లోపలికి రాబోయిన ఆంథొనీ 'ఆగక్కడ!' అంటూ శాసనంలా వెలువడిన ఒక్కమాటతో అడుగు వెనక్కుదీసి హాల్లోనే నిల్చుండిపోయాడు.

"ఈ గుమ్మందాటి లోపలికి రావద్దు. వింటున్నావుగదూ, అదే నీ హద్దు. ఏ కారణం చేతనైనాసరే, హద్దుదాటి లోపలికొచ్చావో- నా శవాన్నిమాత్రమే కళ్ళజూస్తావు..."

తాడూ తగాదాలేకుండా బోట్ల గిత్తలా యిష్టారాజ్యంగా బ్రతికేస్తున్న ఆంథొనీ యింట్లో ప్రవేశించే ధైర్యం ఒక అబలకు ఎలా కలిగింది? ఈ ప్రశ్నకు జవాబు ఊహించిన వాళ్ళులేరు.

తన వంట తాను చేసుకోడానికి వీలుగా ఆంథొనీ కొంత పాత్రసామగ్రిని ఆమెకని కేటాయించిన గదిలోకి చేరవేయించాడు. భాగీరథి రెండు పూటలా కావేరికి వెళ్ళి నీళ్ళు తెచ్చుకుంటుంది. వెక్కిరింతల్ని, వేళాకోళాల్ని ఆమె ఏనాడో లెక్కపెట్టడం మానేసింది. కావేరి నుంచి వస్తూ వస్తూ ఆమె యింటి తోటలో నుంచి గుప్పెడు చెండుమల్లిపూలు కోసుకొచ్చి, హాల్లో మేరీమాత విగ్రహం పాదాలపైన రెండు పువ్వులుంచి, తన గదిలోకి వెళ్ళిపోతుంది.

ఆంథొనీ అదే హాల్లో కూర్చుని వున్నాసరే, ఆమె కన్నెత్తి అయినా చూడదు. అనలలాంటి మానవప్రాణి ఒకటి ఆ యింట్లో నివసిస్తోందన్న స్పృహకూడా ఆమె కున్నట్టుండదు.

చిత్రహింస భరించలేని వాడిలా అత






దొకరోజు ఆమెను పలకరించాడు—"ఏమమ్మా....మాట...."

అతణ్ణి ఒక మనిషిగా పరిగణించడానికి గానీ, అతడి మాటలు వినిపించుకోడానికి గానీ భాగీరథి సుముఖురాలుకాదు. అయినా ఆనాటి అతడి మాటల ధోరణినిబట్టి ఆమె పెడముఖంతోనే అయినప్పటికీ గుమ్మం దగ్గరే ఆగిపోయింది

"ఏం లేదు.... నువ్విక్కడ .... ఇలా యెంతకాలం వుండదలచుకున్నావో తెలుసుకుందామని...." ఆంథొనీ నీళ్ళు నమిలాడు

ఇప్పుడా వివరాలతో నీకేం పనొచ్చిందన్నట్టు ఆమె ప్రశ్నార్థకంగా అతడివైపు చూసింది.

"ఊరుకుంటే ఊళ్ళోవాళ్ళకు తిన్న తిండి అరగదు నిన్నూ, నన్నూ కలిపి వాళ్ళేదో అవాకులు. చెవాకులూ వాగకుండా వుండరు. ఎవరేమనుకున్నా నాకు నష్టమయ్యేది లేదనుకో। కానీ అనవసరంగా నీ పేరు వాళ్ళ నోళ్ళల్లో నలగడం...."

"ఆమాత్రం పుణ్యానికి నువ్వెప్పుడో ఒడిగట్టుకున్నావుగదా। నా పేరింక కొత్తగా పాడయ్యేదేముంది? అయితే ఒకటి. ఒకసారి బురదలో పడిపోయాను గదా అని నేను మళ్ళీ మళ్ళీ ఆ బురదను ఒంటికి పులుముకోడానికి సిద్ధంగా లేను. ఊరేమనుకుంటే నాకేమి? నాకీ నరకం నీవల్లనే వచ్చింది. ఒక చెడ ముహూర్తంలో నా శరీరం నీ చేతుల్లో చిక్కి నలిగిపోయిన నేరానికిగాను నా భర్త నాకీ శిక్ష విధించారు. నేరంలో నీవంతెంతో నీకు తెలుసుగదా। శిక్షలో మాత్రం వాటా లేకుండాపోతుందా? అనుభవించు.."

ఆంథొనీ ముఖం వెలవెలబోయింది.

"దీన్ని నేనొక శిక్షగానే భావించడం లేదు. నేను చేసిన పాపం చాలా పెద్దది. ఈ నీచుణ్ణి ప్రభువు మన్నించడని నాకు తెలుసు. కానీ అందువల్ల నువ్వీ యిల్లే చెరసాలగా యిక్కడ కాలం వెళ్ళదీయడం నాకిష్టంలేదు మీ ఇంటాయన్ను వెదికిపట్టి ఎలాగైనా నిన్నాయనకు అప్పగిస్తేగానీ...." ఆంథొనీ కళ్ళు చెమ్మగిల్లిపోయాయి దున్నపోతులాంటి ఆ మనిషి పసిపిల్లవాడిలా బేలతనం వహిస్తూ తన ముఖాన్ని ఆమెకు చూపలేక అవతలికి తిప్పుకున్నాడు.

"బాగానే చెప్పొచ్చావులే। అప్పటికి నువ్వు మా యింటాయన్ను వెదికిపట్టి, ఆయనకు నన్నప్పగిస్తే మారు మాటాడకుండా దొరికిందే చాలురా దేముడా అని ఆయన నన్నేలుకుంటారనే అనుకుంటున్నావా? నేను మాత్రం జరిగిందంతా మరిచిపోయి తగుదునమ్మా అని చెయ్యి పట్టుకుని ఆయనవెంట వెళ్ళిపోతానా? అశోకవనంలో వుండివచ్చిన సీతను అగ్గిలో దింపితేగాని రాములవారికైనా సందేహం తీరలేదే। నేను నీ యింటికొచ్చి తొమ్మిదేళ్ళయింది. నా భర్త దేవుడు కాదుగా। ఆయనా మనిషే। ఆయనకూ, నాకూ ఈ జన్మకింక ఋణం యెక్కడిది? చచ్చేదాకా యింక నాకీ యిల్లే గతి...."

చివుక్కున ద్వారంవైపు తిరిగి ఆమె లోపలికి వెళ్ళిపోయింది. అలా తిరిగేటప్పటికి బిందెలో నుంచి క్రింది కొచ్చి పడిన నీరు అతణ్ణి చూసి గొల్లున నవ్వుతున్నట్టుగా వినిపించింది.

ఆ యింట్లో ఒక ఆడమనిషి, ఒక మగవాడు జీవిస్తున్న తీరు 'లోకుల పాలిటికి ఒక అంతుచిక్కని 'పజిల్'గానే వుండిపోయింది. ఆ యిద్దరినీ అలా ఒక యింటి కప్పుక్రింద జీవించాలని శాసించే బంధమేదీ లేదు. కానీ ఒకరికొకరు బాధ్యత వహిస్తున్నట్టుగానే ఆ యింట్లో జీవిత నాటకం సాగిపోతోంది.

"అరటిగెల తీసుకొచ్చానయ్యా" అంటాడు పొలం కౌలుకు సాగు చేసే రైతు ముఖంలోని గాంభీర్య ముద్ర చెక్కుచెదరకుండా ఆంథొనీ అంటాడు గదా - "లోపలికి తీసుకెళ్ళు. అమ్మగారుంటారు. ఆమె చేతికివ్వు...."

అలాగే ధాన్యం గుత్తడబ్బు. బెల్లం అమ్మగా వచ్చిన పైకం. చింతకాయ మహసూలు— "తీసుకెళ్ళు అమ్మగారుంటారు. ఆమె చేతికివ్వు.. "

"నా తల్లీ। నేనుచేసిన తప్పిదానికి పరిహారంగా నేను నీకే మిచ్చుకున్నా తీరదు. స్వీకరించు" అన్నట్టుగా ఆంథొనీ తన ఆదాయాన్నంతా భాగీరథి సన్నిధికే పంపించడమూ.

"ఈ ముష్టి సంపదవల్ల నేను కోల్పోయింది తిరిగొస్తుందా?" అన్నట్టు వచ్చిన డబ్బులన్నీ మేరీమాత పాదపీఠం పైన పెట్టి "ఇదిగో మరుదూ। ఇక్కడింత డబ్బుంది తీసుకెళ్ళి మీ అయ్యగారి చేతికిచ్చి భద్రపరుచుకోమని చెప్పు" అంటూ భాగీరథి ఎక్కడ చేరవలసిన సొత్తును అక్కడికే చేర్చడమూ.

ఇవన్నీ ఆ యింట్లో మామూలుగా జరిగిపోయే అనుదిన వ్యవహారాలైపోయాయి. కానీ అక్షరాలా ఆశ్చర్యకరమైన విషయమేమిటంటే భాగీరథి ఆ యింట్లో కాలుమోపినతర్వాత ఆంథొనీ ఏ ఆడదాన్నిగానీ కన్నెత్తి అయినా చూడకపోవడం।

"ఒరేయ్। ఆంథొనీ పెళ్ళాంరా। కావేరిలో జలకాలాడి వస్తోంది?

మరైతే అతగాడు శిలువను పూజించేవాడుగదా। ఈమె యింకా వరలక్ష్మీ వ్రతాలు, నోములూ చేస్తోందంటావా?

ఎంత గాలి కబుర్లయినా అవి ఎవరిని ఎద్దేవాచేస్తూ అంటున్నారో వాళ్ళ చెవిదాకా రాకపోవడం లేదు.

ఒక్కొక్కప్పుడు చీకటిగదిలో గోడకు చేరగిలబడిపోయి ఆలోచిస్తూ కూర్చునేది భాగీరథి.తానేమో ఆడదైపోయింది. తనకైతే ఈ అవహేళనలన్నీ భరించక తప్పదు. ఈ మగమహారాజుకీ బాదరబందీ అంతా ఎందుకొచ్చింది? తలుచుకుంటే ఇంటి నౌకరు చేత తనను మెడబట్టి బయటికి గెంటించడం చిటికెలో పని। మళ్ళీ మునుపటిలా తాగుతూ తూగుతూ నదురైన ఆడదానికల్లా వల వేస్తూ జల్సా చెయ్యొచ్చుగదా। మరైతే

ఇతణ్ణి కట్టుబాట్లకు లొంగివుండేటట్టుగా నియమించిన శక్తి ఏమైవుంటుంది?

ఆలోచనల్లో మరికొంత దూరం ముందుకు వెళ్ళినప్పుడల్లా యిలా అనుకుంది భాగీరథి: ఊరి శివారులో తన భర్త తన కోసమంటూ ఒక గుడిసెవేసి యిచ్చి వుండినా చాలు. తన బ్రతుకింత నవ్వుల పాలై వుండేది కాదేమో? ఆ మాత్రం తలచాటు కూడా లేకపోయింది.

ఆయన యేమయ్యారో? ఎక్కడున్నారో? ఉన్నారో, లేరో? తన బ్రతుకు నింత లక్షణంగా తెల్లవారించడానికేనా ఆయన తనను పెళ్ళాడి యిక్కడికి తీసుకొచ్చింది?

అద్దం ముందునిలచి బొట్టుపెట్టుకుంటున్నప్పుడు. ఆరునెలల దాంపత్య జీవనంలోని మధురానుభవాలు జ్ఞప్తికి వచ్చినప్పుడు, మెడలోని పసుపుదారానికి పెద్ద బండరాయి ఒకటి కట్టి దిగవిడిచినట్టుగా గుండె కలుక్కుమన్నప్పుడు యిలాంటి భావనలెన్నో ఆమె మనసులో ముసురుకునేవి.

ఈ కలతలు. తలపులు తనకు మాత్రమేనా? బహుశా తనను చూసినప్పుడల్లా అతడిలోనూ రగులుకుంటున్నాయేమో?.. యాభై యేళ్ళ వయసొచ్చిన భాగీరథి దీపపు సెమ్మకు పసుపుకుంకమలు పెడుతూ, రెండుకాళ్ళూ వాచిపోయి కదలలేని స్థితిలో మంచాన్ని ఆశ్రయించుకుని వున్న ఆంథొనీ వైపు చూసింది.... ఏమిటో మరి! ఎదుటి మనిషిలోని యింగితం ఎలా తెలుస్తుంది?

ఆంథొనీ వయసు దెబ్బయికి దరిదాపుల్లో వుండొచ్చు ముంచుకొచ్చిన వార్ధక్యంతో బాటు. చిన్ననాటి చెడుతిరుగుళ్ళ ప్రభావం కూడా తోడయిందేమో. అతడు కాటికి కాళ్ళు సాచుకుని కళ్ళల్లో ప్రాణాలు నిలుపుకుని వున్నాడు.

సమయానికి మందు మాకులందించి పరిచర్యలు గావించడానికి మరుదు తప్పితే మరెవ్వరూ లేరు.

ఒకసారి అతడు ఊపిరి ఆగిపోతుందేమో నన్నట్టుగా దగ్గి, ఉమ్మివేయడం కోసం మంచం క్రిందవున్న పింగాణీ



దీపోత్సవం

చిత్రం : మారేమండ శ్రీనివాసరావు


# దికో-ఆపరేటివ్ సెంట్రల్ బ్యాంకు లిమిటెడ్

టెలిగ్రామ్స్ : "COOP BANK"    ఏలూరు    టెలిఫోన్స్ : 91, 491

బ్రాంచీలు : మారుటేరు ఫోన్ : 47. తాడేపల్లిగూడెం ఫోన్ : 2475. కొవ్వూరు ఫోన్ : 63. చింతలపూడి ఫోన్ : 46. నర్సాపురం ఫోన్ : 96. నిడదవోలు ఫోన్ : 258. తణుకు ఫోన్ : 71. గణపవరం ఫోన్ : 98. పాలకొల్లు ఫోన్ : 713

బ్యాంకు యొక్క వ్యాపారం

| | | రు. లక్షలలో | | | రు. లక్షలలో |
|---|---|---|---|---|---|
| చెల్లించబడిన మూలధనం | — | 136 52 | ఋణములు మరియు అడ్వాన్సులు | — | 1279.48 |
| రిజర్వులు | — | 95.52 | | | |
| డిపాజిట్లు అండ్ బారోయింగ్స్ | — | 1277.68 | వర్కింగ్ కేపిటల్ | — | 1509.72 |

డిపాజిట్లపై ఆకర్షణీయమైన వడ్డీ రేట్లు

| | | | | | |
|---|---|---|---|---|---|
| సేవింగ్స్ బ్యాంకు ఎక్కౌంట్లు | – | 5½% | 9 మాసములు మరియు ఆపైన అయితే 12 మాసముల లోపు | – | 6% |
| 15 రోజుల నుంచి 45 రోజుల వరకు | – | 3% | ఒక సంవత్సరం మరియు ఆపైన రెండు సంవత్సరముల లోపు | – | 8% |
| 45 రోజుల నుంచి 90 రోజుల వరకు | – | 3½% | రెండు సంవత్సరములు మరియు ఆపైన మూడు సంవత్సరముల లోపు | – | 9% |
| 91 రోజుల నుంచి 6 మాసముల వరకు | – | 4½% | మూడు సంవత్సరములు మరియు ఆపైన | – | 10½% |
| 6 మాసములు మరియు ఆపైన అయితే 9 మాసముల లోపు | – | 5½% | | | |

* డిపాజిట్లపై నెలవారీ మూడు నెలల కొకసారి వడ్డీ అనుమతించబడును. * డిపాజిట్లు ఇన్సూర్ చేయబడినవి. * సేఫ్ డిపాజిట్లు లాకర్లు లభించును. * చెక్కులు మరియు బిల్లులు డిస్కౌంట్ చేయబడును * ఓవరు డ్రాఫ్టు సౌకర్యము ఏర్పాటు చేయబడును. * రీ ఇన్వెస్ట్‌మెంట్ ప్లాన్ డిపాజిట్లు అంగీకరించబడును. * రికరింగ్ డిపాజిట్లు అంగీకరించబడును. * నెలవారీ రీపేమెంట్ ప్లాను అక్కౌంట్లు అంగీకరించబడును.

బి. దానమ్, బి. ఇ., ఐ. ఏ. ఎస్.
కలెక్టర్ అండ్ ఛైర్మన్.

పి. శేషగిరిరావు, బి.కాం.
సెక్రటరీ.

గిన్నెను తీసుకోబోయి. అది చేతికందక గింజుకుంటూవుండగా భాగీరధి పరుగెత్తుకుంటూ వచ్చి పింగాణీగిన్నె పైకెత్తి పట్టింది.

గజగజ వణకిపోతూ అతడడిగాడు—

"నువ్వా ?.... నువ్వా ? అదేమిటమ్మా మరుదు ఏమయ్యాడు ?"

"ఎక్కడికో వెళ్ళినట్టున్నాడు. ఉంటే వచ్చేవాడుగా ! ఫరవాలేదు. ఈ మాత్రం సాయం చేస్తే నేనేమీ అరిగిపోనులే !"


"వద్దొద్దు. నువ్వు నా మంచం దగ్గరికి రానేవొద్దు. కట్టికుడపడానికి నేను నీకు చేసిన ద్రోహం ఒక్కటే చాలు ఈ జన్మకంతకు మరే పాపానికీ నేను ఒడిగట్టుకోను...."

నెరసిపోయిన గుబురుగడ్డం చాటున మాటుపడిపోయిన అతడి ముఖంలో కళ్ళెక్కడో కందకాల్లా కానవసున్నాయి. జీవకాంతి తరిగిపోతున్న ఆ కళ్ళల్లో పాపభీతి స్పష్టంగా కానవస్తోంది. రోగయాతన. మనోవేదన. చెరొకవైపునుంచీ పీల్చి పిప్పి జేస్తున్న ఆ వృద్ధుడి దయనీయ స్థితి భాగీరథికంట కూడా నీరు పెట్టించింది.

"అలా అనుకోడం దేనికి ? నువ్విన్నేళ్ళుగా నీ యింట్లో నన్ను తలదాచుకోనిచ్చి కూడూ గుడ్డా యిచ్చి పోషించినందుకు ఈపాటి పనిచేసి పెట్టడంలో తప్పేముంది? అదే నీలాగా నేను పడుతున్నాననుకో ! నువ్వుమాత్రం కనిపెట్టివుండవా ? తోటి మనుషులపైన ఆమాత్రం అభిమానం కూడా లేకపోతే ఎలా ? మృగాలం కాముగదా ?"

పింగాణీ గిన్నెను మంచానికి చేరువగా వున్న ముక్కాలి పీటపైన పెట్టి ఆమె కళ్ళు తుడుచుకుంటూ లోపలికి వెళ్ళిపోయింది.

ఆ మరునాడు ఆంథొనీ కథ ముగిసింది. ఊరి జనమంతా బిలబిలమంటూ వచ్చి ఆ యింటిఎదుట మూగారు. ఫాదిరీగారు తుది సంస్కారాలేవో నిర్వహిస్తున్నారు. నిండుగా ముప్పైయేళ్ళకాలం భాగీరథి మూగ జీవితానికి సంరక్షకుడుగా నిలబడిన ఆంథొనీ ఈనాడు అచేతనుడై శవపేటికలో పడివున్నాడు.





మా ఖాతాదార్లకు, శ్రేయోభిలాషులకు దీపావళి శుభాకాంక్షలు

**SYAMALA** SUPERFINE FINISHING BEAUTIFUL
**REAL GOLD SHEET COVERING JEWELLERY**



శ్యామలా గోల్డు కవరింగ్ వర్క్సు
Mfrs & Exporters
చిలకలపూడి (P.O) మచిలీపట్నం-2 AP

బ్రాంచీలు : * విజయవాడ 1 & 2 * స్టేషన్ రోడ్డు. గుంటూరు * గాంధీ చౌక్. తెనాలి * మెయిన్ రోడ్. చీరాల.
* గాంధీ బజార్. ఒంగోలు * మెయిన్ రోడ్. కైకలూరు.

VIJAYA/Mpm

"ఆంథొనీ యింట్లో వున్న అమ్మగారి గతి యికమీదటేం గావాలి?" స్వగతంగా పొటమరించి, ప్రకాశంగా నేజనంలో అల్లుకపోయిన ప్రశ్నకు ఆంథొనీ వ్రాయించిపోయిన వీలునామాలో జవాబు దొరికింది.

భాగీరథి చరమజీవితం సాఫీగా సాగిపోవడానికి అవసరమైనంత ఆస్తిని ప్రత్యేకంగా ఆమె పేర వ్రాయించి, మిగిలిన ఆస్తి పాస్తులు అనాథ బాల బాలికలకు చెందేటట్టుగా వ్రాసి పెట్టిపోయాడు ఆంథొనీ.

"ఫాదిర్‌గారూ! నేనయినా అనాథనేగదండీ! దిక్కులేని దేవుడి బిడ్డల్లో నేనూ ఒకతెని. నా పేరిటవున్న ఆస్తికూడా నా అనంతరం వాళ్ళకే చెందిపోనీ" అంది భాగీరథి.

ఆంథొనీలేని యిల్లు ఏ కోణంనుంచి చూసినా బోసిగా కనిపిస్తోంది. అతడు కూర్చున్న కుర్చీ. పడుకున్న మంచం. ఉపయోగించిన తుపాకీ- యిలా ఏ వస్తువును చూసినా భాగీరథి గుండెలో శోకసముద్రం హోరెత్తిపోతోంది.

ఇంతకూ ఇతడెవరు? ఒకనాటి అసంగతమైన. అక్రమమైన సాంగత్యాన్ని మినహాయించి చూస్తే ఇతడు తనకేమవుతాడు? అతడు కనుమరుగైపోయాడంటే తానెందువల్ల లోకమంతా చీకటైపోయినట్టు భిన్నురాలు కావలసివచ్చింది? అయ్యోపాపం! ఒకరోజు పింగాణీగిన్నెను పైకెత్తి పట్టడంతప్పితే తానతడికేం చేయగలిగింది? పెద్దమనసుచేసి ఒక్కసారైనా గ్లాసుడు మంచినీళ్ళందివ్వలేదే!.... నీతోడిదే లోకమన్నట్టుగా ఆరునెలలపాటు తనతో కాపురంచేసి. ఒక క్షణికావేశంలో చెత్తలా విదిలించిపారేసుకుని వెళ్ళిపోయిన తన భర్తతో పోల్చిచూస్తే ఒకనాటి తప్పిదానికి ప్రాయశ్చిత్తంగా జీవితాంతం తనకు బాసటగా నిలబడి. ప్రతిఫలాపేక్షలేకుండా ఆశ్రయమిచ్చి, కంటికి రెప్పలా కాపాడిన ఈ మనిషి ఎంతటి ఉత్తముడు?

పెల్లుబికివస్తున్న దుఃఖాన్ని ఆపుకోలేకపోయింది భాగీరథి. అగ్నిసాక్షిగా బొట్టుగట్టి, ఆరంజ్యోతి సాక్షిగా చెయ్యి విడవనని బాసచేసి. ఆఖరుకు దిక్కులేని చోట తనను దిగవిడిచి వెళ్ళిపోయిన తన భర్త వ్యక్తిత్వం ఆంథొనీ ఔదార్యం ముందు ఎండలో వెలిగించిన దివిటీలా వెలవెలపోతున్నట్టు ఆ క్షణాన ఆమె కనిపించింది.

"నన్నొంటరిగా విడిచి వెళ్ళిపోవచ్చా?" – అస్పష్టంగా, అప్రయత్నంగా పెదవుల పైనుంచి మాటలు దొర్లిపోయాయి.

ఏ అదృశ్యశక్తో తన నావహించినట్టు ఆమె హఠాత్తుగా లేచి నిల్చుంది. తటాలున తన మెడలోని పసుపుతాడు పైకితీసి గోడకు వ్రేలాడుతున్న తుపాకీకి తగిలించింది. మరుక్షణాన భోరున ఏడ్చేస్తూ నేలపైన వ్రాలిపోయింది.

అవునుమరి! రఘుపతి అర్ధాంగిగా బ్రతకడం కంటే. తానింక ఆంథొనీ తాలూకు విధవగా జీవించడమే ఆమెకు న్యాయమనిపించింది.

